క్లుప్తంగా

శోభాయమానం.. శివపార్వతుల కల్యాణం



కల్యాణోత్సవంలో శివపార్వతులు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజైన శనివారం సాయంత్రం శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ప్రధాన అర్చకుడు మణివాసన్ గురుకుల్ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ శోభాయమానంగా కల్యాణోత్సవం జరిపించారు. కార్యక్రమంలో అశేష భక్తులతో పాటు మేయర్ శిరీష పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం కామాక్షి సమేత సోమస్కందమూర్తి పురుషమృగవాహనంపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. గజరాజులు ముందు కదులుతుండగా, కళాబృందాల కోలాటాలు, భక్తజనుల నడుమ వాహన సేవ కోలాహలంగా నిర్వహించారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి తిరుచ్చి వాహనంపై కొలువైన శివపార్వతులు ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన ఆదివారం నాడు ఉదయం త్రిశూల స్నానం, రాత్రి ధ్వజావరోహణం, రావణాసుర వాహన సేవ నిర్వహించనున్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధం

- త్వరలోనే మరో రెండు మాస్టర్‌ప్లాన్ రోడ్లు
- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి తుడా: నవీన తిరుపతి ఆవిష్కరణ లక్ష్యంగా చేపట్టిన మాస్టర్ ప్లాన్ రోడ్లలో మరో రెండు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని వైఎస్ఆర్ సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త, నగర డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి అన్నారు. హీరో హోండా షోరూం రైల్వే గేట్-కాటన్ మిల్ ప్రాంతాలను కలుపుతూ నూతనంగా నిర్మిస్తున్న 100 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్, తిమ్మనాయుడుపాలెం 80 అడుగుల రోడ్డు తుది దశ పనులను అధికారులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ నగర విస్తరణ కనెక్టివిటీ పెంచడమే లక్ష్యంగా మొత్తం 18 మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేశామన్నారు. ఇందులో 14 రోడ్లను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. 100 అడుగుల కులశేఖర ఆళ్వార్, 80 అడుగుల గోదాదేవి మాస్టర్ రోడ్లను అత్యద్భుతంగా నిర్మించామని చెప్పారు. ఈ రెండు రోడ్లు త్వరలో ప్రారంభించి నగరవాసులకు అంకితం చేయనున్నామని తెలిపారు. రహదారుల అభివృద్ధితో తిరుపతి మరో ఐదువేల ఎకరాల్లో విస్తరించనుందని చెప్పారు. ఈ ప్రాంతం మున్సిపల్ కార్పొరేషన్‌కు వివిధ మార్గాల్లో ఆదాయ వనరులను సమకూర్చనుందని చెప్పారు. అలానే నగరంలో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సులభంగా రాకపోకలు సాగించేందుకు లింక్, కనెక్టివిటీ రోడ్లను 40కు పైగా అభివృద్ధి చేశామని చెప్పారు. రాబోయే రోజుల్లో తిరుపతి మరింతగా అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరు ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మద్దతు ఇవ్వాలన్నారు. నిస్వార్థంగా తాము చేపట్టిన అభివృద్ధిని ప్రజలు గుర్తిస్తున్నారని అన్నారు. ఎంఈ వెంకటరామిరెడ్డి ,డీఈఈ విజయ్ కుమార్‌రెడ్డి, వైఎస్ఆర్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష

మైనారిటీలకు అండగా జగనన్న

తిరుపతి కల్చరల్: సీఎం జగనన్న ప్రభుత్వం మైనారిటీలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తూ వారికి అండగా నిలుస్తోందని, ఇదే రీతిలో తిరుపతి నగరంలో ముస్లింలకు అవసరమైన సదుపాయాలకు పెద్ద పీట వేశారని డెప్యూటీ మేయర్, తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆర్‌సీ రోడ్డులోని ఈఎస్ఐ ఆసుపత్రి సమీపంలో రూ.80 లక్షలతో నిర్మించిన నూతన షాదీమహల్, డైనింగ్ హాల్‌ను శనివారం మేయర్ డాక్టర్ శిరీష, డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ మైనారిటీల అభ్యున్నతికి అవసరమైన సౌకర్యాలను కల్పించి వారి సంక్షేమానికి కృషి చేసేందుకు భూమన కుటుంబం సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే.బాబు, కో-ఆప్షన్ సభ్యులు ఇమామ్ సాహెబ్, ఖాదర్‌బాషా, షాదీమహల్ కమిటీ చైర్మన్ గఫూర్, సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రీ, చోటా భాయ్, రఫీ హిందూస్థానీ, ముస్లిం పెద్దలు మాలిక్, ఫరీద్, ఇబ్రహీం మౌలానా, జుబిర్ మౌలానా, మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.



రహదారి పనులను పరిశీలిస్తున్న అభినయ్‌రెడ్డి

వెండి పళ్లెం బహూకరణ

తిరుపతి కల్చరల్: కొంకా వీధిలో వెలిసిన సాయిబాబా మందిరానికి పూతలపట్టుకు చెందిన డి.దామోదరనాయుడు రూ.1,02,240 విలువల కలిగిన 1114.820 గ్రాముల పంచ హారతి వెండి పళ్లెంను శనివారం బహూకరించారు. ఈ వెండి పళ్లెంను ఆలయ కమిటీ నిర్వాహకులకు దాత అందజేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మబ్బు దేవనారాయణరెడ్డి, కుడితి సుబ్రమణ్యం, దుర్గం శ్రీనివాస్, మర్థం శివ, పి.విజయలక్ష్మీ, సి.రమేష్, హరిబాబు, బాలకృష్ణ, శీను యాదవ్, పి.ప్రభాకర్, వై.లక్ష్మి పాల్గొన్నారు.



మందిరానికి అందజేసిన వెండి పళ్లెం

వడదెబ్బతో యాచకుడి మృతి



దేశిరెడ్డి మృతదేహం

తిరుపతి క్రైం: అలిపిరి ప్రాంతంలో భిక్షాటన చేస్తూ ఓ యాచకుడు వడదెబ్బతో మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. అలిపిరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు పిచ్చాటూరుకు చెందిన దేశిరెడ్డి(80) అలిపిరి ప్రాంతంలో భిక్షాటన చేసేవాడు. రాత్రి సమయంలో దివ్యారామంలో నిద్రపోయేవాడు. బహిర్భూమి కోసం వెళ్లిన వృద్ధుడు చేతి కర్ర పట్టు తప్పడంతో కిందపడి మృతి చెందాడు. అయితే ఒంటిపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో వడదెబ్బ కారణంగానే ఇలా జరిగిందని పోలీసులు చెబుతున్నారు. దివ్యారామంలో వాకర్స్ గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై మృతుడి కుమారుడు సతీష్ ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

క్రికెట్ విజేత సీఈ నాగేశ్వరరావు జట్టు



షటిల్ బ్యాడ్మింటన్‌లో విజయం సాధించిన ఉద్యోగులు

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఉద్యోగుల క్రీడా పోటీల్లో భాగంగా శనివారం ఎస్వీయూ తారకరామ స్టేడియంలో టీటీడీ సీనియర్ అధికారుల క్రికెట్ పోటీలు నిర్వహించారు. టీటీడీ సీనియర్ అధికారుల క్రికెట్ పోటీల్లో సీఈ నాగేశ్వరరావు జట్టు విజయం సాధించింది. ఈఈ శివరామకృష్ణ జట్టు రన్నరప్‌గా నిలిచింది. సీఈ నాగేశ్వరరావు జట్టులో సీపీఆర్‌వో డాక్టర్ టి.రవి, ఈఈలు జగన్మోహన్‌రెడ్డి, ప్రసాద్, డీఈ రవి శంకర్ రెడ్డి, డిప్యూటీ ఈఈలు పార్థసారథి, చంద్రమౌళిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈఈ శివరామకృష్ణ జట్టులో గార్డెన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఈఈ సుబ్రహ్మణ్యం, డిప్యూటీ ఈవోలు సెల్వం, దేవేంద్రబాబు, డీఈవో భాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు. షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్ పోటీలో విజేతగా సి.సునీల్‌కుమార్ యాదవ్ నిలిచాడు. డబుల్స్‌లో సి.సునీల్ కుమార్, చంద్రశేఖర్ రన్నర్స్‌గా.. శ్రీకాంత్, జ్యోతిప్రసాద్ విన్నర్స్‌గా నిలిచారు. బధిర మహిళల విభాగంలో సింగిల్స్ ఫైనల్స్‌లో సంపూర్ణమ్మ, ఎల్.కుమారిపై గెలిచారు. డబుల్స్ ఫైనల్స్‌లో ప్రసన్న, నాగలక్ష్మి జట్టు సంపూర్ణమ్మ, కుమారి జట్టుపై గెలిచారు.

తిరుపతి అభివృద్ధిని అడ్డుకోవద్దు



మాట్లాడుతున్న వాసు యాదవ్

తిరుపతి కల్చరల్: తిరుపతిలో జరుగుతున్న ప్రతి అభివృద్ధి పనికి అడ్డుకట్ట వేస్తూ కోర్టు ద్వారా నిలుపుదల చేస్తూ తద్వారా తన ఉనికిని చాటుకుంటున్న బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డిపై వైఎస్ఆర్ సీపీ నేత, టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుయాదవ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. గతంలో టీటీడీ బోర్డు సభ్యుడిగా ఉన్న భాను నిరంతరం వీవీఐపీల సేవలో తరించి దోచుకున్నాడన్నారు. నేడు మాజీ అయినా తన లేఖల ద్వారా దర్శనాలు పొందుతూ కాసులు వెనకేసుకుంటున్నారని ఆరోపించారు. తిరుమల శ్రీవారి దర్శనానికి ఆయన ఎవరిని తీసుకెళ్లినా తప్పు లేదని, అయితే వేరొకరు దర్శనం చేసుకుంటే ఓర్వలేక దిక్కుమాలిన విమర్శలు చేయడం తగదన్నారు. తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం కష్టపడే పారిశుద్ధ్య కార్మికుల కోసం టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి వారి వేతనాలు పెంచినా కూడా విమర్శించడం దుర్మార్గమన్నారు. కేవలం టీటీడీలో తన పనులు చక్కబెట్టుకునే నెపంతో నిత్యం ఏదో ఒక రకంగా విమర్శలకు దిగడం ఆయనకు నిత్య కృత్యంగా మారిందన్నారు. తిరుపతివాసిగా నగర ప్రజల సంక్షేమాన్ని, నగర అభివృద్ధిని కాంక్షించడాన్ని విస్మరించి తన రాజకీయ గుర్తింపు కోసం నిత్యం విమర్శలకు దిగుతున్నారన్నారు. వైఎస్ఆర్ సీపీ నేతలు పసుపులేటి సురేష్, బచ్చు ప్రకాష్, హరి, మన్యం ప్రేమ్‌కుమార్, చిరంజీవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాల్య వివాహాలపై గ్రామస్తులకు అవగాహన



గ్రామంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు, సిబ్బంది

పాకాల: బాల్య వివాహాలు చేయడం చట్ట రీత్యా నేరమని, బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం ఐసీడీఎస్ శాఖ అంగన్‌వాడీ కార్యకర్త కె.మోహన ఆధ్వర్యంలో మొగరాల పంచాయతీ కృష్ణాపురం గ్రామంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 21 సంవత్సరాలు పూర్తి అయిన తరువాత మాత్రమే వివాహాలు చేయాలని, లేని పక్షంలో రక్తహీనత, పోషక లోపాలతో ఇబ్బందులు పడాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తోన్న పోషణ పక్వాడ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈ కార్యక్రమం ద్వారా బాలింతలకు, యుక్తవయస్సు బాలికలకు, గర్భవతులకు పోషక విలువలు కలిగిన చిక్కీలు, పప్పులు, గుడ్లు తదితరాలను అందజేస్తున్నారని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు షమీమ్, ధన, పుష్ప, భారతి, ఝాన్సీ, ఏఎన్ఎం సంధ్య, ఎంపీహెచ్ఓ వాట్‌కిన్స్ పాల్గొన్నారు.

ఆది దంపతులకు వైభవంగా కల్యాణోత్సవం







శ్రీమాణిక్యాంబ సమేత శ్రీభీమేశ్వర స్వామివారి కల్యాణం, చిన్నగొట్టిగల్లు శివాలయంలో జరిగిన శ్రీమాణిక్యాంబ సమేత శ్రీ భీమేశ్వర స్వామి కల్యాణం, తలకోనలో సిద్ధపూజ కార్యక్రమం

చంద్రగిరి: తొండవాడ స్వర్ణముఖీ నది ఒడ్డున వెలసిన శ్రీఅగస్త్యేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదిదంపతులకు శనివారం సాయంత్రం శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున 12.30గంటలకు లింగోద్భవ అభిషేకం నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించడానికి భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథ రెడ్డితో పాటు భక్తులు పాల్గొన్నారు.

కాంచిన కనులదే భాగ్యం

ఆర్ఎఫ్ రోడ్డులో వెలసిన శ్రీశ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయం(పుట్టాలమ్మ)లో మహాశివ రాత్రి ఉత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున లింగోద్భవ అభిషేకం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు శివ కుమార్ శర్మ ఆధ్వర్యంలో సాయంత్రం ఆలయ ఆవరణలో పార్వతి పరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

బండకొండపై ఘనంగా సిద్ధపూజ

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలంలోని బండ కొండ బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే సిద్ధపూజ ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం శ్రీసిద్ధేశ్వర స్వామి, అమ్మవార్లకు కలశ జల అభిషేకం చేసి, ప్రత్యేక అలంకరణలో హారతి ఇచ్చి భక్తులకు సర్వ దర్శనం కల్పించారు. 11 గంటలకు సిద్ధపూజ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా ప్రధాన అర్చకులు శ్రీసిద్ధేశ్వరి సమేత శ్రీసిద్ధేశ్వర స్వామివార్లను సిద్ధపూజ ఆహ్వానించారు. సిద్ధులు తయారు చేసిన ప్రసాదాన్ని దేవునికి పళ్లెం వేసి నైవేద్యం పెట్టి తలకోన సిద్ధులు, నెలకోన సిద్ధులు, బండకొండ సిద్ధులను ఆహ్వానించారు. జంగమదేవర్లు దేవతలను పొగిడి ఆనందింపచేశారు. అలాగే మిరాశీదార్లు స్వామి అమ్మవార్లను, గ్రామ దేవతలను, ముక్కోటి దేవతలను సిద్ధపూజకు ఆహ్వానించారు. అనంతరం సిద్ధులు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. చిన్నగొట్టిగల్లులోని శ్రీ మాణిక్యాంబ సమేత శ్రీభీమేశ్వర స్వామికి తెల్లవారు జామున లింగోద్భవ దర్శనం అనంతరం స్వామి వారిని ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన కల్యాణానికి వందలాది మంది భక్తులు తరలి వచ్చారు. అనంతరం సిద్ధపూజ కార్యక్రమం నిర్వహించారు.



తొండవాడ అగస్త్యేశ్వర స్వామివారి ఆలయ ఆవరణలో ఆది దంపతులకు కల్యాణోత్సవం



కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు హాజరైన భక్తులు

అలాగే నెమిలి గుండ్లు శివాలయం, తుమ్మచేనుపల్లెలోని శ్రీసిద్దయ్య ఆవు దేవుర నందీశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

తలకోన బ్రహ్మోత్సవాల్లో ఘనంగా సిద్ధపూజ

తలకోన(భాకరాపేట): తలకోన బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే సిద్ధపూజ ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం శ్రీసిద్ధేశ్వర స్వామి అమ్మవార్లకు కలశ జల అభిషేకం చేసి, ప్రత్యేక అలంకరణ చేసి హారతి ఇచ్చి భక్తులకు సర్వ దర్శనం కల్పించారు. ప్రధాన అర్చకులు శివప్రసన్న శర్మ, సత్యప్రసాద్ శర్మ శ్రీసిద్ధేశ్వరి సమేత శ్రీసిద్ధేశ్వర స్వామివార్లను సిద్ధపూజకు ఆహ్వానించారు. అనంతరం సిద్ధుల చేత ప్రసాదాన్ని పంపిణీ చేశారు.


వరపడిన మహిళలు

సంతానం కోసం ఈ ఏడాది 108 మంది మహిళలు వరపడ్డారు. వీరందరికి సిద్ధులతో ప్రసాదం పంపిణీ చేశారు. దీన్ని స్వీకరించిన మహిళలు కళ్లకు అద్దుకుని తమకు సంతానాన్ని ప్రసాదించాలని శ్రీసిద్ధేశ్వరుడిని ప్రార్థించారు. ఆలయ ఈవో జయకుమార్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ భూమిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీపీ ఊటూకూరి రెడ్డెమ్మ, జడ్పీటీసీ కరుణాకర్‌రెడ్డి, వైఎస్ఆర్ సీపీ మండల అధ్యక్షుడు నాగార్జున రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చెంగల్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పలువురు గ్రామ పెద్దలు, జంగమ దేవర్లు పాల్గొన్నారు.

వెండి పళ్లెం బహూకరణ

తిరుపతి కల్చరల్: కొంకా వీధిలో వెలిసిన సాయిబాబా మందిరానికి పూతలపట్టుకు చెందిన డి.దామోదరనాయుడు రూ.1,02,240 విలువల కలిగిన 1114.820 గ్రాముల పంచ హారతి వెండి పళ్లెంను శనివారం బహూకరించారు. ఈ వెండి పళ్లెంను ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. మబ్బు దేవనారాయణరెడ్డి, కుడితి సుబ్రమణ్యం, దుర్గం శ్రీనివాస్, మర్ధం శివ, పి.విజయలక్ష్మి, సి.రమేష్, హరిబాబు, బాలకృష్ణ, శీను యాదవ్, పి.ప్రభాకర్ పాల్గొన్నారు.





సమష్టి కృషితోనే శివరాత్రి ఉత్సవాలు విజయవంతం



తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డిని సత్కరిస్తున్న శ్రీధర్ రెడ్డి

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు యోగిమల్లవరంలో వెలసిన శ్రీకామాక్షాంబ సమేత పరాశరేశ్వర స్వామివారి మహా శివరాత్రి ఉత్సవాలు అన్ని శాఖల అధికారుల సమష్టి కృషితోనే విజయవంతమయ్యాయని ఆలయ చైర్మన్ శ్రీధర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన స్థానిక తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన్ను ఘనంగా సత్కరించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల తీర్థప్రసాదాలు, దేవేరుల చిత్రపటాన్ని బహూకరించారు. తిరుచానూరు సీఐ శ్రీకాంత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివశంకర్ రాజులను సత్కరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా స్వామివారి మహాశివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు పోలీసు, పంచాయతీవారి సహకారంతో ఉత్సవాలు ఘనంగా ముగిశాయని, ఉత్సవాల నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట ఆలయ పాలక మండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



